

# కుట్ర

జాతశ్రీ

కప్పర కప్పర చీకటి మొహాన్నే బిక్కుతండాకెళ్లి ఉత్త చేతులతో తిరిగొచ్చిన నాగముని, ఇంటి ముందు కొట్టంలో కూచొని చేసే పనేది తోచక, తలగోక్కుంటూ, అల్లంత దూరంలో పడి వున్న పాతపీటను చూసి బాగు చేసేందుకు ముందేసుకొని, “చిన్నోడా... రేయ్ చిన్నోడా... పెద్దులీ, చిన్న బాడిశా పట్రా...” అంటూ కేకేశాడు.

ఇంటి వెనుక వసారాలో కూచోని నిన్న బడిలో ఇచ్చిన లెక్కలు రాక, కిందా మీదా తంటాలు పడే చిన్నోడు, తండ్రి కేకకు చిరాకుపడుతూ, “నేన్రాసు కొంటున్న... నువ్ దెచ్చుకో,” అన్నాడు.

నాగముని విసుగు నషాళానికంటింది. “ఆర్నీ సదువు సట్టబండలు గాను, నడిజాందాకా రెడ్డోరింటి కాడ టి.వి. సూస్తంటే సదువు యాదికి రాలె! ఉలందు కొమ్మనేసరికి... ఓరారి... ఈ బుద్ధులుంటే ఇగ బువ్వ దిన్నట్టే...” అన్నాడు.

“ఇగ్గో, ఉలి. పూరా తుప్పట్టిందిగాదూ! కూసింత ఆకురాయిన రుద్దు. అయినా ఏందా అరుపు? ఆడొక్క డ్నన్నా నాలుగచ్చరాలు సదవనియ్, ఆడు బుక్కులు ముందేసుకోంగనే, నీకు పని యాదికొస్తది. పనిమీద కూకునే ముంగల పనిముట్లు సూసుకోవద్దా?“ నాగ ముని భార్య ఉప్పలమ్మ ఉలందిస్తూ అంది.

“ఇగ్గో, నువ్విట్టనబట్టే పెద్దోడు కోటిలింగం నా మాటినకుండా సొంతెవారాలు సేసకొస్తాండు. కొడుకు లిద్దర్నీ నా రెండు రెక్కలనుకున్నందుకు... తల్లా, నీకో దండం, నీ కొడుకులకో దండం... నా శెరలెయ్యో నే బడతగాని, నన్నొగ్గెయ్, ఇయ్యాల్రేపూ... బతకసెప్పటవూఁ తప్పవుతాంది,” అన్నాడు నాగముని.

“అరె, నేనిప్పుడేవఁన్నని అంత గనం గింజు కుంటున్నవ్?”

నాగముని భార్యకేసి ఈసడింపుగా చూసి, “ఇకా గవమ్మా... మా సెప్పొస్తన్నవ్, సదూకుంటుండని, పని జెయ్యకుంట బుక్కులు ముందేసుకుంటే తెల్లారి పోద్దేంటి? జర పని యివరం సుత వొంటబట్టాల, అప్పుడే బతుకు... ఎరకయిందా?” అన్నాడు నాగముని.

“బ-తు-కు, మనం బతుకుతున్నంగాదూ, బత్కు...!” వెక్కిరింతగా వత్తి పలికింది ఉప్పలమ్మ.

“ఏవఁయిందే మన బతుక్కి?... ఎవుడి కొంపో ముంచి, మరెవుడి మోచేతి నీళ్లో తాగి బతకటంలె,” విసురుగా అన్నాడు నాగముని.

ఉప్పలమ్మలో ఉక్రోషం ఉబికిందిగాని, బల వంతంగా తమాయించుకొంటూ, “కడుపు సించు కుంటే, కాళ్లమీద పడుద్ది... ఎందుకులేగానీ, బిక్కు తండా కెళ్లినవ్‌గా, ఏవాఁయై,” అంది నెమ్మదిగా.

మరుక్షణంలోనే నాగముని మొహం పేలవంగా మారింది. అప్పటివరకూ ఎగసిపడిన ఆవేశం చల్లారి, ఆవేదనగా రూపొందింది. స్వరమూ మారింది. “పోన యితే పోయిన, ఆ కస్నాగాడు దొంగ గుడుంబా అమ్ము తుండుగా!... మిత్తికడుగుదావఁనుకొన్న. ఆడు సుత తెల్లమొగమేసిండు. నిన్న మాపిటేలనే ఆప్కారోళ్లొచ్చి దాసుకొన్న పదొందలూ దొబ్బకపోయిన్రంట. కేసు పెడ తరనే బయానికి అడగంగనే యిచ్చి, కాళ్మొక్కితే వదిలేసి న్రంట,” నెమ్మదిగా అన్నాడు.

“సీ... సీ... మాయదారి రోజులైనయ్, ఆపద కాదుకునేటోడు నల్లపూసై పోతాండు. ఊర్లిట్ల గొడ్డు బోతుయై పోతయనుకోలె... యింగెందు కీడ బతకడం?“ అంది ఉప్పలమ్మ.

"ఈడ బతుక్క?" నొసలు చిట్లించాడు నాగముని.

"యాడన్న బతుకుదాం... కులంపని చేసే బత కాలనుందా... ఆ కోదాడ కెళ్లిబోయి కూల్జేసుక బతికితే కాదంటరా?" అంది ఉప్పలమ్మ.

"పొరుగూరి సోల కూలి కన్న, ఉన్నూరి గిద్దెకూలి మెరుగే పిచ్చిదాన."

"ఉన్నూరేంది, పొరుగూరేంది?... ఆ బెరలెప్పుడో సెరిగిపోయినయ్, ఇయ్యాల్రేపూ అన్నూర్లూ వొహటే... ఎనకటి తీర్న మాటకీ, పూటకీ అర్సుకునోళ్లు కనబడ తండ్రేంది?... జనాలు బతుకుదెరువు కోసం దేశాల్దాటి పోతాన్రుగాదూ!... అళ్లు ఏలకెయులు పంపిస్తాంటే యీడున్నోళ్లు మస్తుగ బతకుతున్రు, సూత్తనే ఉన్నం గాదూ!" ఎంతో వివరం ఉన్నదానిలా అంది ఉప్పలమ్మ.

"ఒకళ్లని సూత్తె మన కొరిగేదేంది గాని, మన గండం గడ్సేదెట్టనో సూడవే!"

ఉప్పలమ్మ టక్కున నోరు పడిపోయిందానిలా మారిపోయింది. క్షణమాగి, "ఎట్ట, ఏం సేద్దాం?" అంది దిగులుగా.

"నాకేం తోసుబడి కాకనే నిన్నడుగుతున్నా. ఊర్లె ఎవురికాడ పైసల్లేనట్టుగుంది," ఉప్పలమ్మకేసి పేదగా చూస్తూ అన్నాడు నాగముని.

"ఊర్లె పైసల్లెవ్వా?... మస్తుగున్నయ్... కాకుంటే ఎనకట్లా ఆపద కాదుకునే బుద్ధులు మారినయ్... అరె, పైసలుండీ, యియ్యాల్నుండీ, యియ్యకుంట తిప్పు కుంటున్రంటే... ఎగనాం బెట్టాలని కాకుంటే ఏందా యవ్వారం? నీకా సోపతి సుత లేదాయె! నిలేసి, గల్ల బడితే సచ్చుకుంటిస్తరు. పనిముట్టు సేయించుకుంటా నికైతే పాటికి పదిమాట్లు నీ సుట్టే తిరుగుతరు. పైసలనే సరికి మొగాలు సాటేసుకుంటరు. సీ... సీ..." తుపుక్కున ఉమ్మేస్తూ అంది ఉప్పలమ్మ.

భార్య ఎవరి గురించి అంటుందో నాగముని పసిగట్టాడు. కాపోళ్ల వెంకటాద్రి తొమ్మిది నెలల కింద పెళ్లయిన బిడ్డకిచ్చిన పందిరిమంచం బాపతు యింకా ఎనిమిది వందలివ్వాలి. కోమటప్పయ్య దుకాణంలోకి అరలపెట్టె చేయించుకొని, ఐదొందలు యివ్వడానికి ఆర్నెల్లుగా తిప్పుకొంటున్నాడు. ఇంకా చిల్లర మల్లర రావలసినవి వెయ్యి పై చిలుకే ఉన్నాయి. కాని ఎవరి నడిగినా, పేదమొహాలేసి, గడ్డం పుచ్చుకొని, దీనంగా చూస్తుంటే, నాగముని గట్టిగా అడగలేకపోతున్నాడు.

"పంటల్లేక ఆరేళ్ల నుంచి ఆసాములు బతుకులెట్ట బుగ్గయిపోతున్నాయో నీకూ ఎరకే... యింగ నేనెవురి గల్ల బట్టనే" అన్నాడు.

"ఎవుర్నీ పట్టొద్దులే... నన్నూ, నా పిల్లల్నీ కట్టగట్టి ఆ సేదబాయిలెయ్యి, లేకుంటే యింత పురుగుల మందు దెచ్చి గొంతులపొయ్... ఇంగేంది?" పెడసరంగా అంది ఉప్పలమ్మ.

నాగముని నోరు పడిపోయినవాడిలా మారిపోయాడు. తల దించుకొని, చేతిలోని ఉలి పదును తాకుతూ నేలచూపులు చూడసాగాడు.

"సెప్పవేంది?... పిల్లది రేపోమాపో అనేట్టుంది. సేతిల సిల్లిగవ్వ లేకుండాయె. ఆపదెట్టా గట్టెక్కుద్ది?" అంది ఉప్పలమ్మ.

"నేనేడ సచ్చేది?... ఎవుర్నడిగినా వోరం, పద్దినాలాగి సెపుతవంటున్రు," అన్నాడు నాగముని.

"అట్లని పిల్దాని కాన్పాగుద్దా? లేకలేక నాలుగేళ్ల కందిన కాన్పాయె! అదీ తొలి కాన్పు. ఎట్టబొయి ఎట్టొస్తదోని బయంగుందయ్యా.." ఉబికే కన్నీటిని పవిటతో అద్దుకుంటూ అంది ఉప్పలమ్మ.

"నాకు తెల్వదానె" అతని కళ్ల వెనుకా నీటి గుండం కదులుతున్న జాడ.

"ఏదో కిందామీదా పడి మిత్తికన్నా సూడు. అసలే పిల్లది సొప్పకట్టలా ఉంది. నెత్తురు తక్కువుందని డాట్రమ్మ సెప్పింది."

"తండాకి పోయ్యొస్తా... గుర్రం ఏశాపుగాడు ఎదురుపడితె అడిగిన, ఏవోఁ... ఊరి సర్పంచాయె! అదోఇదో చేసి సర్దుతడనిపించింది. ఆపద సుత సెప్పిన. గీపెట్టంగ, పెట్టంగా, రేప్పయిటాలకి సూస్తనన్నడు. అన్నడేగాని నమ్మకం పెట్టుకోవద్దన్నడు," అన్నాడు నాగముని.

"సర్పాయె... అమ్మ పెట్టదు, అడుక్కోనివ్వదన్నట్టు- ఒకెళ్లి యిస్తననీ, యింకోకెళ్లి నమ్మకం పెట్టుకోవద్దంటే... పెద్దమనిషి తరీఖేనా? కుదిరేపని కాదుగాని, ఆ ఎరకల పోశాల్గాడినడిగి సూడు," అంది ఉప్పలమ్మ.

"ఆడా! ఆడికాడ దొరుకుతయంటవా?"

"మొన్ననే ఆరు పందులమ్మిండుగాదూ! మిత్తిస్తవంటే ఆసెపడ్తడు. ఆపదిదిరా... పోశిగాంటే ఉండి లెవ్వనడు. కులానికి సిన్నోడయినా, మన పెద్దకులపోళ్ల కంటే జర మాట నికరం మన్ని."

"రయితేగాని, రేపెవారం బెడ్సికొడితే ఆడి నోరు కాయలేం గద?" అన్నాడు నాగముని.

"నీ అనుమానం ఉట్టిగెక్క. అవతల పిల్దాని పానం మీదుంటే... మంచీ, సెబ్బర ఆనెక. ముందుగాల ఆపద గట్టెక్కేది సూడు," ఉప్పలమ్మ అంది.

"సర్లే పొయ్యొస్తగాని, పెద్దోడు కోటిలింగవేఁడి... యింగా లేవలేదా?" అన్నాడు నాగముని.

''ఆడెప్పుడో... నువ్వటు తండాకెళ్లిపోంగనే లేసిండు గాదూ, మొగం సుత కడిగిండు.''

''మరేడి?''

''ఏవోఁ మరి... రేత్తిరి బువ్వ ముంగల కూకొని, అక్క సంగతి సుత అడిగిండు. ఆడికీ కాలూ సెయ్యీ కుదురుగుండటంలే... యాడ బొయిండో కొడుకు,'' ఉప్పలమ్మ సానుభూతిగా అంది.

''యాడ బోతడు? ఏ సవాసగాడితనో, పైసక్కొర గాని మంతనాలాడుకుంట బజారుపొంటె తిరుగుతుంటడు,'' అన్నాడు చిరుకోపంగా నాగముని.

''ఆడు ఆటకోయిల పోరడేంగాదు, పొద్దస్తమానం నీ రెక్కల తాన పనిజేస్తుండుగాదూ...''

''ఆఁ... నా తాన సెడబడపనుండె! నీ కొడుకు పొద్దస్తమానం రెక్కలిర్సుకుంట శెరబడతండు. అంటానికి నోరెట్టొచ్చిందే... బాడిసెత్తక ఎన్నాళ్లాయె ఆ కోవంటాయన టాట్టరొచ్చిన కాన్నుంచి నిఖార్సయిన పనేదన్న సేసిన్నా?...'' నాగముని అన్నాడు.

''పన్జేయించుకున్నోళ్లు సుత పైసలిస్తున్రాయేంది? అన్నీ ఆయిదాల పద్దులేనాయె!''

''అగ్గో ఆ పితలాటకం మాటలే వద్దు. నేనొకటి సెపితే నువ్వనేదింకోటి, యింగాగు నువ్వన్నట్టు ఆ పోశాల్గాడి కాడికి పొయ్యొస్త తియ్,'' అంటూ మోకాళ్ల బిగువున లేచాడు నాగముని.

ఉప్పలమ్మ మనసు పొరల్లో చివుక్కుమంది. ఆమె కాపురానికొచ్చిన ఇన్నేళ్లలో ఏనాడూ నాగముని మాటకు పెద్దగా ఎదురాడింది లేదు. ఇప్పుడయినా అవసరం కొద్దీ, పేగుతీపి కొద్దీ, తప్పనిసరి పరిస్థితుల్లో నోరు చేసుకుందే తప్ప, నిజానికామె నెమ్మదస్తురాలే! పిల్లలెదుగుతూ, అవసరాలూ పెరుగుతుంటే... ముఖ్యంగా- గత నాలుగేళ్ల నుంచీ, అంటే పెద్దపిల్లకు పెళ్లయిన్నాట నుంచీ ఆమె నోరు అడపాదడపా వీధిలోకి విన్పిస్తూంది. న్యూనతాభావంతో కదిలిపోతూ, భర్తకేసి చూడకుండానే చిన్న స్వరంతో, ''ఛాయి దెస్త, తాగిపో...'' అని, యింటి వెనుక వసారాలోకెళ్లి, పొయ్యిమీదున్న టీని పొడవాటి కంచుగ్లాసు నిండా నింపుకొని, తుండుగుడ్డతో చుట్టి, పట్టుకొచ్చి నాగముని కందించింది ఉప్పలమ్మ.

టీ ఊదుకుంటూ తాగి, ఖాళీగ్లాసు ఉప్పలమ్మ కందించి వీధిలోకి నడిచాడు నాగముని.

జంగిలి గొడ్లు అడవికి వెళ్లే వేళ, రెడ్డోళ్ల వీధిలో జంగిలిగొడ్ల పిల్లోడు వేసే కేక జీరగా విన్పిస్తూంది. డ్వాక్రా మహిళలు నలుగురు బ్యాంకు అప్పు కోసం మండలాఫీసు కెళ్లేందుకు తోటి వాళ్లకోసం ఎదురు చూస్తూ నిలుచున్నారు. ఎండ మండిపోడానికి తయారుగా ఉంది. పోశాలు గుడిసెకేసి బయలుదేరిన నాగముని నాలుగు వీధుల కూడలిలో నిలుచున్నాడు. అతని మనసు గజిబిజిగా ఉంది.

వేలాది రూపాయల వడ్రంగి పనులు ఒంటిచేత్తో చేసిపెట్టిన తనకు ఒక్క ఐదొందలు పుట్టకపోవడంతో, అతనికి ఊరిమీద కాదు... తనమీద తనకే నమ్మకం చచ్చిపోతుంది. తన పనితనమంతా పనికిమాలినదై నట్టనిపిస్తుంది. రైతులు ట్రాక్టరు మోజులో, తనతో చేసుకొన్న ఖరారునామాను రద్దు చేసుకున్నట్టే, మంచి తనాన్నీ రద్దు చేసుకొన్నట్టనిపించింది. తన అవసరం లేనందున రైతులు తన అవసరాన్నీ కాదంటున్నారను కొన్నాడు. అలా అనుకుంటున్న కొలదీ, ఆలోచనలు సాగే కొలదీ, అతనికి బాధగా, గుండెల్ని బాడిసెతో చెక్కుతున్నంత బాధగా ఉంది.

రెండొందల గడపున్న ఆ ఊరికి, నాగముని తండ్రి వీరాచారి సుమారు ముప్పయి ఐదేండ్ల కింద తన ముగ్గురు కొడుకులతో పాటు వచ్చాడు. అంతకు ముందు ఆ ఊరికి వడ్రంగి లేడు. వడ్రంగి పనులన్నీ అక్కడికి కోసెడు దూరంలోనున్న తమ్మర వడ్రంగులే చేసిపెట్టేవాళ్లు. వ్యవసాయ పనిముట్లతో పాటు ఏ చిన్న కర్రపని తగిలినా, రైతులు పొలంపనులకు నాగాబెట్టి, కోసెడు నడవక తప్పేదికాదు. అయినా వెంటనే పన య్యేది కాదు. అదంతా పెద్ద తలనొప్పిగా వుండేది. తమ్మర రైతులు తగని కిరికిరి పెట్టేవాళ్లు. దాంతో ఊరి రైతులంతా కూడబలుక్కొని, వీరాచారిని నడిగూడెం నుంచి రప్పించడం జరిగింది.

వీరాచారి ముగ్గురు కొడుకుల్లో చిన్నవాడు నాగముని. అప్పటికి నూనూగు మీసాల వయసు. చెక్క దూగోడ పట్టడంలోని మెళుకువా, రంపం ఆడించడం లోని ఒడుపూ, ఉలి కదిలించడంలో నేర్పూ నేర్చాడు కాదు. పెద్దబాడిసె లేపితే వంకర తిరిగేది. మొద్దుబారిన పనిముట్లను సానబట్టడం తెలుసు. పొడవాటి తునికి చెక్కమీద పలుగురాళ్లపొడి చల్లి ఒక్కొక్క పనిముట్టునీ ఎడమచేత్తో పిడిపట్టి, కుడిచేత్తో చెక్కమీద అదుముతూ వెనక్కీ ముందుకు ఆడిస్తూ, మధ్యమధ్య పదును చూస్తూ, తృప్తి కలిగాక పక్కనుంచేవాడు. అటువంటి నాగముని మరో పదేళ్లకే కలప నగిషీ పనులకు నెలవై పోయాడు.

రైతువారీ వ్యవసాయ పనిముట్లు తండ్రీ, యిద్ద రన్నలూ చేయగలరుగాని, సున్నితమైన నగిషీ పనులు మాత్రం నాగముని చేతిమీదుగా తయారుకావలసిందే! పందిరి మంచాలూ, కుర్చీలూ, బల్లలూ, తదితర పని

తనం కనిపించే పనుల్లో అతను ఆ ఊరిలో గుర్తింపు పొందాడు.

ఈ పనితనం నాగమునికి ఆషామాషీగా అబ్బిందేం కాదు. వీరాచారి పెద్ద కొడుకులిద్దర్నీ పనిలో దింపి, ఇంకా పనిలో రాటుదేలనందున నాగమునికి పై పనులు అప్పగించేవాడు. దాపునున్న కోదాడ నుంచి ఇంటి సామానులు, వడ్రంగి పని సామానులు, మక్కూ మైనం వగైరాలు కొనితేవడం కోసం అతను దినానికి ఒకటీ రెండుసార్లు కోదాడ నడిచేవాడు. ఆ సమయంలోనే, అతను సరుకులు కొనే దుకాణానికి దగ్గరలో 'ఉడ్ ఫర్నిచర్ షాపు' అతని కంటబడింది. తీరున్నొక్క వస్తువులు, రకరకాల డిజైన్లు, నునుపుగా, వార్నీస్ వేసివున్న ఆ వస్తువుల్ని చూస్తుంటే అతని మతిపోయింది. నాగళ్లు, గొర్లు, బండ్లు తదితర రైతువారీ పనిముట్లను చేసి బతికే వడ్రంగి, రకరకాల నగిషీ పనిముట్లు చేసి, ఎక్కువ సంపాయించుకోవచ్చుననుకొన్నాడు. ఫర్నిచర్ షాపులో వివరాలడిగి తెలుసుకొని ఖార్ఖానా యజమానిని కలిసి దినకూలికి కుదిరాడు.

విషయం తెలిసిన వీరాచారి, "ఒకని దగ్గర కూలి చెయ్యాల్సిన ఖర్మ నీకేందిరా?... నాలుగు మొద్దులు చెక్కుకుంటే మారాజులా బతుకుతవ్," అన్నాడు.

"ఈ మొద్దు-మొద్దుల పని నేన్జెయ్య. నాకు మన పెద్దబాడిసె పట్టే వొడుపన్నా తెల్వదు. అది లేపితే మొద్దే చెక్కుతనో, కాలే నరుక్కుంటనో... భయంగుంది. చిన్నచిన్న సామాన్లు చేసేది నేర్చుకొంటే తప్పా?" అన్నాడు నాగముని.

వీరాచారి కాదనలేకపోయాడు. నాగముని చురుకుదనం మీద నమ్మకంతో, పై ఎత్తున రికంగా దిరిగేబదులు కులం పనుల్లో కొత్త వొడుపులు నేర్చుకుంటాడనిపించి, "నీ యిష్టం," అన్నాడు.

అయితే ఓ ఆరునెలలు గడుస్తూనే, ఏరువాక రోజులొస్తూనే రైతుల వ్యవసాయ పనిముట్ల ఒత్తిడి ఎక్కువై నాగమునిని కోదాడ పని మాన్పించేశాడు వీరాచారి.

'వరస తెలిసింది, కిందోమీదో పడి మనవూఁ పని మంతులమన్పించుకొందాం,' అనుకొన్నాడు నాగముని.

కలప జాతి, వయసు, అది పెరిగిన నేలతీరును బట్టి కలప నాణ్యత ఉంటుందని తెలుసుకొన్నాడు. తక్కువజాతి కలపైనప్పుడు దాని విలువ పెంచేందుకు యేయే మెరుగులు పెట్టాలో నేర్చుకున్నాడు. మక్కూ, మైనం ఉంటే మాయలు చెయ్యొచ్చని గమనించాడు. కర్రమేకు బదులు యినుపమేకు వాడడంలో గల సౌలభ్యం గుర్తించాడు. పని వత్తిడి లేని సమయాల్లో కలప తీరును బట్టి రకరకాల వస్తువులు చేయడం ఆరంభించాడు. మరో ఆర్నెల్లు గడిచేసరికి అతనికి కుర్చీలూ, బల్లలూ చేయగలననే నమ్మకం పూర్తిగా కలిగింది.

ఆ నమ్మకం కలిగిననాడు అతని వయసు పాతిక. ఆరోజుల్లోనే అతని పనితనానికి బహుమతిగా పదివేలతో ఉప్పలమ్మ అతని జీవితంలోకి అడుగు పెట్టింది.

ఆ మరుసంవత్సరమే వీరాచారి ఊరిపెద్దల్ని కూచోబెట్టి, తన వాడుక రైతుల్ని ముగ్గురు కొడుకులకు సమానంగా పంచి, 'కలిసి బతుకుతూ కుళ్లుకునే బదులు, విడిగా బతుకుతూ కలిసుండండని, పనితనం ఉంటే ఎక్కడైనా మారాజులా బతకొచ్చనీ', చెప్పేసి, 'తన బాధ్యత తీరింది. ఈ బతుకికక చాలు,' అనుకొన్నాడేమో... మరో ఐదునెలలకే, మూడేళ్ల కింద కను మూసిన భార్యను వెతుక్కునేందుకు బూడిదైపోయాడు.

మృగశిర కార్తె పడడంతోనే పల్లెల్లో కంటికి కును కుండదు. నీరసిస్తే, కాలం దాటిపోతే మెతుకూ, బతుకూ ఉండదు కాబట్టి, పనిలేని రోజుల్లో ఎవరెంత రికంగా తిరిగినా, తొలకరి వర్షం పడగానే జూలు దులుపుకొన్న సివంగి పిల్లల్లా వ్యవసాయం జీవితాధారంగా బతికే వాళ్లందరూ చేలల్లో, నాగలి సాలల్లో... చెమటోడుస్తూ కనిపిస్తుంటారు. ఆరోజుల్లోనే వడ్రంగులపై అపరిమితమైన పనిభారం పడుతుంది. రేయింబవళ్లు చేసినా తరగని పని. రైతులు ఆనాటి వరకూ అటకెక్కించిన పనిముట్లను తెచ్చి, 'అదునుపోతాంది, తొందరగా కానివ్వ'మని తగని హడావుడి చేస్తారు. కర్ర పనులే కాదు, కమ్మరి పనీ చేయాలి. నాగలి కర్రులు, కొడవళ్లు, గొడ్డళ్లు, తదితర మొద్దుబారిన యినుప పనిముట్లనీ తిత్తికొలిమిలో కాల్చి, సరిచేసి బిగించడం, సానబట్టేవి- పలుగురాయి చెక్కన సానబట్టడం, బండి గిరకల్ని పిడకలతో కాల్చి చట్రానికెక్కించడం... వడ్రంగుల కంటికి కునుకూ, వంటికి విశ్రాంతీ ఉండదు.

వ్యవసాయ పనిముట్లను చేసినందుకు, వడ్రంగులకు శాల్తీల లెక్కన గాకుండా, ఏడాదికి ఎకరానికింత, అని రైతులంతా కలిసి ఖరారునామా రాసిస్తారు. ఆ విధంగా ఎంతలేదన్నా ఏడెనిమిది పుట్ల ధాన్యం, నగదో పదివేలపైనే ముడుతుంది. పైగా అన్నలిద్దరూ చేయలేని నగిషీ పనుల వల్ల మరికొంత ఆదాయమూ వస్తోంది.

నాగమునికి ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కొడుకులూ కలిగారు. కుటుంబం పెద్దదైనందున అతనేం బెంబేలెత్తకపోగా, తన పనితనంతోనే కూతుళ్ల పేర రెండెకరాల పొలమూ కొనగలిగాడు. తన పనుల్లో ఆసరాగా ఉండేందుకు ఇద్దరు పనివాళ్లనూ పెట్టుకున్నాడు.

అంతా సజావుగా, హాయిగా జరిగిపోతుందను కుంటున్న సమయంలో అనగా సుమారు పన్నెండేళ్ల క్రితం ఊహించని రీతిగా, ఆ ఊళ్లోకి దిగబడిందో టాటావారి ట్రాక్టరు. కోమటి ముత్యాలు బ్యాంకు అప్పుతో ట్రాక్టరు కొన్నందుకు ఊరంతా ముక్కున వేలుంచుకొన్నారు. సెంటు భూమి కూడా లేని, కిరాణం కొట్టు నడుపుకునే కోమటి ముత్యాలు ట్రాక్టర్ కొనడం లోని అంతరార్థం తెలిశాక ఊరు విస్తుపోయింది. నాగమునయితే, 'బతకనీ... ఎవుడికెంత రాసుంటే అంత... ఎన్నేషాలు, ఈరంగాలు ఏసినా రాతెవురు మారుస్తరు?' అనుకొని తన్ను తాను ఊరడించు కున్నాడే తప్ప ఎవరినీ తప్పు పట్టలేదు. తిట్టిపొయ్యనూ లేదు. ట్రాక్టరు తన బతుకులో కలిగించే ఉప్పెననూ పసిగట్టలేదు.

వడ్రంగులకు పుట్లకొద్దీ ధాన్యం కొలిచి, వాళ్ల ఇళ్ల చుట్టూ దినాల తరబడి తిరిగి, ఆపై నెలా, రెన్నెళ్లు ఎండకీ వానకీ తల్లడిల్లే బదులు... అదే ధాన్యం కొలిచి, ట్రాక్టరును బాడుగకు తీసుకుంటే అటు సమయమూ, ఇటు కష్టమూ తగ్గిపోతుందని రైతులు లెక్కలు తీసేరు. దుక్కిటెద్దుల్లేక పొలాలు కౌలుకిచ్చినవాళ్లు చంకలెగ రేసేరు. నాగలిపని జీతగాళ్ల చికాకులు పడలేనివాళ్లూ తేలికగా నిట్టూర్చారు. ట్రాక్టర్‌తో దున్నిస్తే సాలూ, ఇరవాలూ బాగుందనీ, విత్తనం త్వరలో ఎదిగొస్తుందనీ, రైతులు చాలావరకు నాగళ్లను పక్కనబెట్టారు.

నాగళ్లనే కాదు, రైతులు నాగమునినీ పక్కన బెట్టారు. ఖరారునామాలు కొట్టేసుకున్నారు. 'మేం బతికే దెలా?' అంటే ఆకాశం కేసి చూయించారు. అవసరం పడితే శాలీల లెక్కన కూలి కట్టిస్తామని నిర్మొహమాటం గా చెప్పేశారు.

అయినా నాగముని గుండె చెదరలేదు. పనితన ముంటే ఎక్కడైనా మారాజులా బతకొచ్చని తండ్రి చెప్పిన మాటలు మననం చేసుకొన్నాడు. రైతువారీ పని మట్లకు గిరాకీ తగ్గినా, యిళ్లల్లో కావల్సిన సామానులూ, ఇండ్లు కప్పడం, అవో యివో పనులు చేసుకుంటూ బతగ్గలనులే అనుకున్నాడు తప్ప, తన ధైర్యాన్ని కోల్పోలేదు.

ఆ విధంగా నాగముని బతుకులాటలో తన ధైర్యాన్ని కోల్పోనినాడు, అతను నడివయసు దాటి వృద్ధాప్యం కేసి అడుగేసేందుకు సిద్ధంగా ఉన్నాడు. అంటే నలభై అయిదుకు ఆవల, యాభైకి దాపుగా.

ఊరి స్థితేం మారకపోయినా పరిస్థితులు చెకచెకా మారిపోతున్నాయి. జనం వైఖరిలోనూ మార్పు కనిపి స్తుంది. ఊరితో ముడిపడిన నాగముని బతుకురీతి తదనుగుణంగా మారక తప్పలేదు. తనకు తోడుగా పెట్టుకొన్న పనివాళ్లను మాన్పించేశాడు. వయసు లేతదయినా పెద్దకొడుకు కోటిలింగాన్ని పనిలో తోడుగా పెట్టుకొన్నాడు. ఇండ్ల కప్పులూ, ఇంట్లోకి కావలసిన చిన్నచిన్న కఱ్ఱ సామానులు చేసుకుంటూ, అమ్ముకుంటూ... నాగముని కుటుంబాన్ని బాధగా కాదుగాని, భారంగా నడుపుకొస్తున్నాడు.

అదేరోజుల్లో గోరుచుట్టుపై సుత్తెదెబ్బలా ఓ మూడేళ్లు నకిలీ పురుగుల మందుల మోసాల్లో, మరో మూడేళ్లు వర్షాలు లేక గ్రామాల్లోని వ్యవసాయాధారిత కుటుంబాలు విలవిలలాడాయి. నీరు కరువైన ఊరు రోగం తగిలిన పత్తిచేనులా నవిఁసి, నలిగి, ముడుచుక పోయినట్టుగా... ఊరిలో పచ్చదనం, పల్లెతనం కరువైపో యింది.

పరిస్థితులను బట్టి నాగముని అవసరాలు తగ్గించుకొన్నా, మరీ తప్పని అవసరాలకోసం చేబదుళ్ల తో నెట్టుకొస్తున్నా... అతని గుండె గట్టిదే, ధైర్యం కోల్పో లేదు. 'పనితనం ఉన్నప్పుడు...' అన్న తండ్రి మాటలతో ఊరట చెందుతూ, గుండెల్లో కదిలే నిట్టూర్పుల్ని అణచిపెట్టుకుంటూ... కాలమూ, కష్టమూ వెలుగూ, చీకటిలా సహజమనే వేదాంత ధోరణితో రాజీపడే వేళ అతని బతుకు రీతి మరో బలమైన కుదుపుకు లోన యింది.

అడవుల్లో ఆనాటివరకూ అవసరం కోసం స్వేచ్ఛ గా తెచ్చుకొన్న గుట్టగడ్డిని అటవీ అధికారులు అడ్డగిం చడం, జుల్మానా వేయడం పైగా మూడు నాలుగేళ్లకే ఇంటికప్పు మార్చాల్సి రావడం, అగ్ని ప్రమాదాలు తదితర కారణాలవల్ల జనం ఇళ్లకు గడ్డికప్పులు మానేసి, సిమెంటు రేకుల కప్పులు ఆరంభించేసరికి, నాగముని నోట మాటపెగల్లేదు. ఒక్క ఇల్లు కప్పితే నెలగాసం దొరికే అవకాశం జారిపోయినందుకు ఉప్పలమ్మ ఉరేసు కుంటే పీడా విరగడైతదన్నట్టుగా చూసింది.

అయినా నాగముని బెంబేలెత్తలేదు. దిగాలు పడిపోయిన భార్యను ఊరడిస్తూ, "పోతేపోనీ... నువ్వేం దిగాలుపడబాక, నా వంట్లె నెత్తురింక సావలె. పనితనా నికి సావేలేదు. ఇంటి సామాన్లు చేసుక బతుకుదాం. ఏడవబాక..." అని ఉప్పలమ్మకు ధైర్యం చెప్పినా... ఆ తర్వాత రోజుల్లో ఆ ఆశా అడుగంటింది.

సామాజిక అడవుల పేర ఉన్న అడవుల్ని కొట్టేసి, వ్యాపారపరమైన మొక్కల్ని నాటడం, చెట్టుకొడితే తీవ్రమైన నేరంగా పరిగణించడం, అడవులపై నిఘా పెరగడంతో సరైన కలప అందుబాటులో లేకుండా

పోయింది. మంచి కలప మామూలు జనానికి అందని ధరల్లోకి దూరిపోయింది.

కలప ధర కొండెక్కేసరికి, ఇనుము వెర్రెత్తిపోయింది. రకరకాల 'స్టీల్ ఫర్నీచర్' తలుపులు వెలిశాయి. వాయిదాల పద్ధతిలో స్టీలు సామానులు- కలప వాడుకలో గల కవ్వం దగ్గర్నుంచి పందిరి మంచం దాకా ప్రతి వస్తువుకూ ప్రత్యామ్నాయంగా స్టీల్ గ్రామ ప్రవేశం చేయడంతో వడ్రంగి పనివారలు గిలగిల లాడారు.

స్టీల్‌తోపాటు నాకూ వాటా కావాలంటూ ఆ తర్వాత రోజుల్లో ప్లాస్టిక్ కూడా రంగప్రవేశం చేసేసరికి నాగముని నిలువుగుడ్లేశాడు.

జనజీవనంలో వేగం పెరిగింది. మంచీ, మన్ననా ఆలోచించే ఓపిక నశించిపోయింది. నాణ్యత, నగిషీ తనం కంటే అవసరం గట్టెక్కడం ముఖ్యమైపోయింది. ఖరీదైన కలప కొని, వడ్రంగి చుట్టూ తిరిగే సమయం లేక, చీకాకు పడలేక, జనం స్టీల్, ప్లాస్టిక్ సామానులకేసి దృష్టి మరల్చారు. కలప వస్తువులు కేవలం కలిగినవారి సొత్తయిపోయాయి. గ్రామాల్ని అంటిపెట్టుక పెరిగిన అడవుల్లోని కలప గ్రామాలు దాటి, చీకటిమాటున పట్టణాలకు పయనించింది.

నాగమునికి నికరమైన పని లేకుండాపోయింది. చిన్నచిన్న కలప వస్తువులు చేసి అమ్ముకుందామన్నా కొనే నాథుడు కరువైపోయాడు.

పనితనం ఉన్నవాడు తిండికి లేకపోయినా ఉండగలడేమోగాని, పనితనానికి అవకాశం లేకపోతే పిచ్చెక్కిపోతాడు. నాగమునికి రోజులు గడవడం మహా చిరాగ్గా ఉంది. వేదనలా ఉంది. మనసు వికలమైపోతున్నట్టుగా వుంది. దాంతో వయసూ వడబారిపోతున్నట్టని పిస్తున్నది. దాంతో రోగాలు... ఆరోగ్యకరమైన మనసు కొదువైన శరీరానికి దాపురించే సవాలక్ష రోగచిహ్నాలు నాగమునితో జతకట్టేందుకు సిద్ధపడ్డాయి.

రాబడి అవకాశాలు సన్నగిల్లినా, కుటుంబ అవసరాలు నాగముని మనసులో మెలి దిరుగుతూనే ఉన్నాయి. పెద్దపిల్లకు మంచి సంబంధం వచ్చినందున ఉన్న రెండెకరాలూ తెగనమ్మక తప్పలేదు. పాతికవేల కట్నంతో పిల్లని సాగనంపేసరికి నాగముని పరిస్థితి మరింత దయనీయంగా మారిపోయింది.

తన తండ్రి మిగిల్చిన యిల్లూ, తుప్పు పట్టిన వడ్రంగి పనిముట్లు, కాలం చెల్లిన పనితనమూ తప్ప, రోజువారీ బతుకుకు కనీసంగా కావలసినవేవీ లేని వెంగళప్పలా నాగముని మిగిలిపోయాడు.

రోజూ ఉదయాన్నే లేస్తూ, బోసిపోయి, పొక్కిలి పొక్కిలిగా ఉన్న కొట్టంలో ఓ గంపలో పనిముట్లన్నీ పెట్టుకొని, దినమంతా పడిగాపులు పడినా, ఏ వొక్కరూ ఏ అవసరం కోసం రాకపోవడంతో అతని గుండెల్లో అపరిమిత, అనిర్వచనీయ బాధ వున్నా... ఎవరైనా కదిలిస్తే మటుకు, "ఎల్లకాలం చీకటుండదురా ఎర్రి నాగన్నా... మొన్న కలపరోజులు... నిన్న స్టీలు రోజులు... యియ్యాల ప్లాస్టిక్... బతుకుచక్రం ఓ రీతి నుండదురా... అది గిరగిరా తిరుగుతూనే ఉంటది. మళ్లీ కలపకి కిరీటం పెట్టే రోజులొస్తయిరా..." అంటూ, ఉబికే కన్నీటిని బిగబట్టుకుంటూ... కుంటూ...

*

కోదాడ చెరువు అలుగు పట్టిన, తన పందుల్ని పెంచుకుంటూ అక్కడే ఉంటున్న పోశాలు గుడిసెకేసి నాగముని నడుస్తున్నాడు నీరసంగా.

ఎండ ఎండలా లేదు. నిప్పులు కురుస్తున్నట్టు వుంది. తుండుగుడ్డ తలకు చుట్టుకొని నీరసంగా అడుగులేసే నాగముని, పోశాలు గుడిసె దగ్గర కొచ్చేసరికి గొంతు తడారిపోయింది. గుడిసె పక్కన కానుగచెట్టు నీడకు చేరి, పోశాలు భార్యకేసి 'మంచి నీళ్ల'న్నట్టు సైగ చేశాడు.

పోశాలు భార్య తెల్లబోయింది. తను నీళ్లిస్తే తాగొచ్చో, లేదో తెలీక, క్షణం తటపటాయించి, 'పెద్ద మడ్సి, దూపమీదున్నడు, ఎట్టయినా మాబాగే!' అను కొని కుండలోంచి చెంబునిండా నీళ్లు తెచ్చిచ్చింది.

చెంబందుకొని, నీళ్లు తాగిన నాగముని, మిగిలిన నీళ్లు మొహాన చల్లుకొని, తుండుగుడ్డతో తుడుచు కొన్నాడు.

"ఏంది మారాజా, ఎర్రటగ్గినొచ్చిను?" నాగముని సేదదీరాక, నింపాదిగా అంది పోశాలు భార్య.

"నీ మొగుడితో పనిబడ్డదే..."

"అట్నా!... ఆడు మన్సి తీర్నలేడు మారాజా... మొన్న పందులమ్మిన్నాట్నుంచి అదే మూడ్రోజుల్నుంచి వొహటే తాగుడు, ఆ గుడుంబ నాశినంవైపోను, కాయెనక కాయ... ఆడు సోయికే రాటంలె, అగ్గో, సూడుండి... గుడిసెనక, పందుల గూటికాడ, సూడిపంది తీర్న పడుండు," అంది.

నాగముని గుడిసెనక్కి, పందులగూటి దగ్గరకు చేరాడు. గబ్బు వాసన, ముక్కుకు తుండుగుడ్డ అడ్డం పెట్టుకున్నాడు.

పందిగూటి పక్కనే వున్న పందుల కుడితితొట్టి పక్కన, బురద మట్టిలో శవంలా పడున్నాడు పోశాలు.

"ఇగిప్పుడు లేవడు మారాజా..." అంది పోశాలు భార్య.

నాగముని లోలోపల దీర్ఘంగా నిట్టూర్చి, "సర్లే పొయ్యొస్త," అన్నాడు.

"పనేంది మారాజ... ఎన్నడ్రాని దిక్కొచ్చింద్రు, ఏంది?"

"ఏం లేదేంలేదేం..." తడబడుతూ అని, వెను దిరిగాడు నాగముని.

ఇంటికి చేరి, కొట్టంలో ఉన్న నులకమంచం వాల్చుక కూచొని, "ఏమేవ్, ఉన్నవా... జర నీళ్తే..." అన్నాడు.

"అస్తన్నా," అంటూ లో నుంచి స్టీలు చెంబుతో నీళ్లందించి, నాగముని తాగాక, తిరిగి చెంబందు కొంటూ, "పెద్ద పిలగాడొచ్చిండు, బువ్వ పెడదావఁని..." అంది.

"తిరుగుడయిందా...యాడికి బొయిండంట?" అన్నాడు నాగముని అసహనంగా.

అన్నం తినేందుకు నీళ్లగాబు దగ్గర కాళ్చేతులు కడుక్కునే కోటిలింగానికి తండ్రి మాటలు విన్పించాయి. అసలే అల్లకల్లోలంగా ఉన్న అతని మనసు మరింత కలవరానికి లోనయింది. కొట్టంలో ఉన్న తండ్రి దాపుగా వచ్చాడు.

"ఏంద్రా కోటీ... యిట్ట తిరిగితెట్ట బతుకుతవ్‌రా... యింటిపట్టు నుండి ఏవఁన్న పన్జేసుకుంటే కాదా?" అన్నాడు నాగముని.

కోటిలింగం బదులివ్వలేదు. బాధగా తండ్రికేసి చూశాడు.

నాగముని కంగారుగా, "ఏంద్రా ఏందట్ట సూస్త న్నవ్?... ఎవుడితనన్న గొడవపడ్డవా?" కొడుకు చేతులు పట్టుకొని అన్నాడు నాగముని.

భర్త మాటలకు ఉప్పలమ్మ ఉలిక్కిపడింది. "ఏంద్రా కోటీ... ఏవయింది, సెప్పరా కొడకా," అంది. అప్పటికే ఆమె కళ్లనిండా నీళ్లు.

"గొడవలేంది, నేనెవుడతనన్న గొడవ పడంగ యిన్నరా?" చిరాగ్గా అన్నాడు కోటిలింగం.

"మరేందో సెప్పరాదురా?..." అంది ఉప్పలమ్మ.

కోటిలింగం తలెత్తి చూశాడు. అతని కళ్లల్లో కదిలాడే కన్నీటిని గమనించింది ఉప్పలమ్మ. భయంగా చూస్తూ, "కొడకా!..." అంది గాద్గద్యంగా.

"నసుగుడేందిరా, సెప్పు?" నాగమునికీ లోలో భయంగానే ఉంది. జరగరానిదేదో జరిగినట్టు అతని మనసున ఓ భావం అస్పష్టంగా కదలాడుతోంది.

"ఏంలే... కోదాడలో కొట్లో జీతానిక్కుదిరిన," కోటిలింగం బేలగా చూస్తూ అన్నాడు, అతని స్వరం పీలగా ఉంది.

"ఆఁ!" భార్యభర్తలిరువురూ, ఒకేసారి, ఒకే రీతిన ఉలిక్కిపడ్డారు.

"అవునమ్మా... బయానగూడ దీసుకొన్న," అంటూ జేబులోంచి, ఐదు నూర్రుపాయల నోట్లు తీసి తల్లి మొహంలోకి బాధగా చూస్తూ, "అక్క కోసం ఉంచమ్మా," అన్నాడు. అలా అంటుంటే అతని కను కొనుకుల్లో నిలిచిన నీరు చుక్కలై చెంపలపై పడింది.

ఉప్పలమ్మ చేతిలో ఐదు నూర్రూపాయుల నోట్లు... నోట మాటరాక, భర్తకేసి చూసింది.

నాగమునికి అయోమయంగా ఉంది. "మన ఇంటా వంటాలేదు గదరా... ఒకరి కింద పన్జెయ్యటం... ఏం పని?..." అన్నాడు.

"ఏ పనయితేంది?... మనగ్గావాల పైసలు, ఆళ్లకి గావాల పని."

"ఎవురికాడ?"

"కోదాడ స్టీలుషాపుల... నెలవారీ జీతానిక్కు దిరిన, నెలకి పదొందలు... ఆపద జెప్పి అడిగితె, బయానకింద ఐదొందలిచ్చిండు సేటు," అంటూ మరో మాటకు అవకాశం ఇవ్వకుండా ఇంట్లోకి నడిచాడు కోటిలింగం.

కొడుకుకు అన్నం పెట్టుకుందామని ఉప్పలమ్మ కూడా ఇంట్లోకి పోయింది.

నాగముని కనురెప్పలు కదలడం మానేశాయి. మనసు గజిబిజిగా ఉంది. పనితనముండీ, తమ బతుకు లిలా ఎందుకూ కొరగాకుండా పోవడానికి గల కారణాలేవో, అతని ఆలోచనలకందడం లేదు.

ఆ మాయల మర్మం తెలుసుకోగల తెలివి తేటలు అతనికి లేవు!

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 19 సెప్టెంబర్ 2004*

